సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం : 6 : జూన్ : 2023



యాదాద్రిలో బ్యాటరీ వాహనాలు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం బ్యాటరీ వాహనాలను ప్రారంభించారు. - 8లో



అందని ఆన్‌లైన్ సేవలు
గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలు అందడం లేదు. దీంతో కంప్యూటర్లు, ఇన్వర్టర్లు వృథాగా ఉన్నాయి. - 9లో

గరిష్టం/కనిష్టం
41°/28°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు పారిశ్రామిక ప్రగతి ఉత్సవం

భువనగిరిటౌన్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక ప్రగతి ఉత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి మందడి లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరిలోని పారిశ్రామిక వాడలో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలో పారిశ్రామిక రంగంలో సాధించిన ప్రగతిని, టీఎస్‌ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపన, అనుమతులు మంజూరు తదితర విషయాలు ప్రస్తావించనున్నట్లు వెల్లడించారు.

యాదాద్రిలో నలుగురు ఉద్యోగుల రాజీనామా

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భాజాభజంత్రీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులు రాజీనామా చేస్తున్నట్లు ఈఓ గీతారెడ్డికి సోమవారం లేఖ పంపారు. ఈ ఏడాది నిర్వహించిన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు భాజాభజంత్రీ, మేళ తాళకులకు సంబంధించి ఉద్యోగ నోటిఫికేషన్ వేశారు. 10 మంది డోలు, సన్నాయి, శృతి, తాళం వంటి పోస్టులకు హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో పరీక్ష రాశారు. ఉద్యోగుల ఎంపిక సమయంలో జడ్జీలుగా వ్యవహరించిన వెంకట సుబ్బయ్య (యాదాద్రి డోలు వాయిద్యాకారుడు), కేశవ (భద్రాచలం ఆలయంలో సన్నాయి) డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలతో గత నెల 26న దేవాదాశాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. వీరి విషయంలో విచారణ జరుగుతున్న క్రమంలోనే ఆలయంలో పని చేస్తున్న రాఘవేంద్ర, ప్రకాష్ (డోలు), సురేంద్రబాబు (తాళ్ళం), సుదర్శన్ (సన్నాయి) తమ ఉద్యోగాలకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తూ ఈఓకు లేఖ పంపారు. జడ్జిలకు డబ్బులు ఇచ్చి తాము ఉద్యోగాలు సంపాదించినట్లు లేఖలో పేర్కొన్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఈఓకు లేఖ పంపిన విషయం వాస్తవమేనని దేవస్థానం అధికారులు వెల్లడించారు. అయితే వీరి రాజీనామాను ఈఓ ఇంకా ఆమోదించలేదని అధికారులు తెలిపారు.

చెరువుల పండుగకు స్థల పరిశీలన



మోత్కూరులోని పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

మోత్కూరు : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న నిర్వహించనున్న చెరువుల పండుగ ఏర్పాట్లను సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రితో కలిసి పరిశీలించారు. మోత్కూరులోని పెద్ద చెరువు వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లు సవ్యంగా చేయాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, ఇరిగేషన్ ఏఈ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు ఉన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు

సాక్షి ఎఫెక్ట్..

భూదాన్‌పోచంపల్లి : మున్సిపల్ పరిధిలోని శ్రీమిత్ర సాయిసాద లేఅవుట్‌లోని 711/పి, 715/పి, 716/పి, 734/పి, 735/పి, 736 సర్వే నంబర్లలో గల మున్సిపల్‌కు చెందిన 7000 చదరపు గజాల ప్రభుత్వ భూమి అక్రమంగా చేసుకున్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు రద్దు అయ్యాయి. గత నెల 20న సాక్షి దినపత్రికలో ప్రభుత్వ భూమి హాంఫట్ శీర్షికన, అలాగే మే 25న పదిశాతం మాయం అనే శీర్షికన కథనాలు ప్రచురితం అయ్యాయి. దాంతో ఉన్నతాధికారులు స్పందించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, బీబీనగర్ సబ్ రిజిస్ట్రార్ సతీష్, వెంచర్ యజమాని, ప్లాట్లుకొన్న వారితో హియరింగ్ నిర్వహించారు. ఆయా సర్వే నంబర్‌లలో గల రిజిస్ట్రేషన్ అయిన సుమారు 7వేల గజాల భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసుకొంటున్నట్లు వెంచర్ యజమాని ఎంవీ చౌదరి డాక్యుమెంట్లను ఉన్నతాధికారులకు అందజేశారని పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి తెలిపారు. కాగా మున్సిపల్‌లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై 15 రోజులుగా ప్రతిపక్ష పార్టీలు ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. అంతేకాక కలెక్టర్‌తో పాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దాంతో విచారణ చేపట్టిన అధికారులు ఎట్టకేలకు అక్రమ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేశారు.

లక్ష టన్నులు కేంద్రాల్లోనే!



వలిగొండ మండలం సంగెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

వలిగొండ మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇంకా పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు ఉన్నాయి. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుంకిశాల సెంటర్‌లో 10 వేలు, పులిగిళ్లలో 12వేలు, ఏదుళ్లగూడెంలో 15 వేలు, సంగెంలో 10 వేల బస్తాల ధాన్యం నిల్వ ఉంది. అదే విధంగా ఐకేపీ ఏర్పాటు చేసిన సంగెం కొనుగోలు కేంద్రంలో 25 వేలు, గోకారంలో 25 వేలు, ఎం.తుర్కపల్లిలో 15 వేలు, వెల్వర్తిలో 25 వేల బస్తాల ధాన్యం పేరుకుపోయింది.

వానాకాలం వచ్చినా పూర్తికాని యాసంగి ధాన్యం కొనుగోళ్లు
- కొనుగోలు కేంద్రాల్లో ఇంకా 20 శాతానికి పైగా నిల్వలు
- కాంటా వేసిన ధాన్యం ఎగుమతిలోనూ జాప్యం
- సాగు పనులు వదులుకొని రైతుల పడిగాపులు

కొనుగోలు కేంద్రాలు	సేకరించిన ధాన్యం
294	3.15 లక్షల మెట్రిక్ టన్నులు
ఎగుమతి చేసింది	**మొత్తం రైతులు**
2.97 లక్షల మెట్రిక్ టన్నులు	35,028
చెల్లించాల్సిన నగదు రూ.237.18 కోట్లు	

సాక్షి, యాదాద్రి : జిల్లాలో 50 రోజుల క్రితం ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తికాలేదు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఇప్పటి వరకు 70 శాతమే కొనుగోలు చేసింది. ఇంకా 20 శాతానికి పైగా వడ్లు కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అలసత్వం, సమస్యలు పరిష్కరించటంలో అధికారులు విఫలం కావడంతో లక్ష్యసాధనలో జాప్యం జరుగుతోంది. వానాకాలం సాగుకు సమాయత్తమయ్యే రోజుల్లోనూ.. రైతులు ధాన్యం రాశుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 3.15లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇంకా లక్ష మెట్రిక్ టన్నులపైనే కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంది.

కాంటా వేయని ధాన్యం లక్ష టన్నుల పైనే..

ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అధికారుల అంచనాల ప్రకారం ఇంకా లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉంది. జిల్లాలో 35 మిల్లులకు 2.38 లక్షల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా లక్ష్యం పూర్తయ్యింది. కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యాన్ని నిల్వ చేయడానికి మిల్లులు, గోదాంలలో స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ధాన్యాన్ని దించుకోలేమని అధికారులకు మిల్లర్లు చెప్పేస్తున్నారు.

లారీల కొరత.. ఎగుమతిలో జాప్యం

జిల్లా వ్యాప్తంగా సోమవారం నాటికి 3.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అందులో మిల్లులకు 2.97లక్షల మెట్రిక్ టన్నులు ఎగుమతి చేశారు. ఇంకా 18 వేల మెట్రిక్ టన్నులు ఎగుమతికి సిద్ధంగా ఉంది. లారీల కొరత కారణంగా కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఎగుమతి చేయలేకపోతున్నారు. ఎగుమతి చేసిన ధాన్యాన్ని మిల్లర్లు సకాలంలో దించుకోవడం లేదు. తాలు పేరుతో క్వింటాకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు వాపోతున్నారు. తాము ఒప్పుకోకుంటే ధాన్యం దించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా వలిగొండ, చౌటుప్పల్, బీబీనగర్, రాజాపేట, తుర్కపల్లి, బొమ్మలరామారం, భువనగిరి, రామన్నపేట, గుండాల మండలాల్లో పెద్ద ఎత్తున ధాన్యం నిల్వ ఉంది.

నగదు చెల్లింపులోనూ ఆలస్యమే..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు అందడం లేదు. జిల్లా వ్యాప్తంగా 35,028 మంది రైతులకు రూ.237.18 కోట్లు చెల్లించాల్సి ఉంది. 15 రోజులుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు.పెట్టుబడుల కాలం కావడంతో బిల్లుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

ధాన్యం తెచ్చి రెండు నెలలైంది



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి రెండు నెలలు కావస్తుంది. ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. రైతుల వద్ద లారీ యజమానులు అదనంగా వసూలు చేస్తున్నారు. మిల్లర్లు బస్తాకు 2 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ధాన్యాన్ని తరుగు తీయకుండా వెంటనే కాంటా వేయాలి.

–మాంకాళి సిద్దయ్య, రైతు, మొగిలిపాక

మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారు



వడ్లు నాణ్యత లేవని మిల్లర్లు బస్తాకు 3 కిలోల వరకు తరుగు తీస్తున్నారు. శనివారం వలిగొండలోని హనుమాన్ రైస్ మిల్లుకు ధాన్యం పంపగా తరుగు తీస్తామన్నారు. దీనికి నేను ఒప్పుకోకపోవడంతో లారీనుంచి ధాన్యం దించుకోలేదు. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదు.

–ఆవుల నర్సింహ, గురునాథ్‌పల్లి

వడ్లు అమ్మి నెల రోజులు



కొనుగోలు కేంద్రంలో నెల రోజుల క్రితం 150 బస్తాల ధాన్యం విక్రయించాను. ఇప్పటి వరకు ఖాతాలో డబ్బులు జమ కాలేదు. వానాకాలం సీజన్ మొదలైంది. పెట్టుబడికి డబ్బులు కావాలి. ఎప్పుడు వస్తాయో తెలియదు. రెండు, మూడు రోజులు చూసి ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పు తీసుకోవాలని చూస్తున్న.

–బూడిద స్వామి, యాదగిరిపల్లి

పవర్ కట్, పవర్ హాలిడేలు లేవు

- విద్యుత్ రంగంలో కేసీఆర్ తీసుకువచ్చిన సంస్కరణల వల్లే 24 గంటల కరెంట్
- జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి : విద్యుత్ రంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకువచ్చిన సంస్కరణల వల్ల నేడు పవర్ హాలిడే, పవర్ కట్ అనేవే లేవని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడి అన్నారు. అన్ని రంగాలకు నిరంతరాయంగా 24 గంటల పాటు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం భువనగిరి పరిధిలోని రాయగిరిలో నిర్వహించిన విద్యుత్ విజయోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2014కు ముందు సరిగా విద్యుత్ ఉండేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిస్థితి మారిపోయిందని, అన్ని రంగాలకు నాణ్యమైన కరెంట్ అందుతుందన్నారు. జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం ఉత్పత్తి అవుతుందంటే సాగు నీటి వనరుల పెంపు, విద్యుత్ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణల వల్లే సాధ్యమైందన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న కరెంట్‌ను రైతులు వృథా చేయొద్దన్నారు. 2014 సంవత్సరానికి ముందు జిల్లాలో 3 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండేవని, ప్రస్తుతం 4.30 లక్షలకు పెరిగాయన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రంథాలయ సంస్థ జడల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, విద్యుత్ ఎస్ఈ శ్రీనాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కిష్టయ్య, ట్రాన్స్‌కో డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పస్తులేనా..!

- డిమాండ్ల సాధనకు రేషన్ డీలర్ల నిరవధిక సమ్మె
- నిలిచిపోయిన బియ్యం పంపిణీ
- రేపటి నుంచి మండల కేంద్రాల్లో దీక్షలు



రేషన్ దుకాణానికి బంద్ పోస్టర్ వేస్తున్న డీలర్

భువనగిరి, భువనగిరి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రేషన డీలర్లు సమ్మె బాట పట్టారు. రేషన్ డీలర్ల సంఘం నిర్ణయం మేరకు సోమవారం నుంచి రేషన్ దుకాణాలు బంద్ చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రజా పంపిణీ నిలిచిపోయింది. గత నెల 20వ తేదీన రేషన్ డీలర్లతో చర్చలు జరిపిన పౌరసరఫరాల శాఖ మంత్రి.. డిమాండ్లు నెరవేర్చడానికి హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు జీఓ విడుదల చేయకపోవడంతో సమ్మె చేయడానికి డీలర్లు మొగ్గు చూపారు. ప్రతి నెలా 1నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెలలో షాపులకు ఇంకా బియ్యం చేరుకోలేదు. జిల్లాలో 515 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో2,15,945 కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 42.28 లక్షల కిలోల బియ్యం కార్డుదారులకు పంపిణీ చేస్తారు.

నేడు షాపుల ఎదుట ఫ్లెక్సీల ఏర్పాటు

సమ్మెలో భాగంగా సోమవారం జిల్లాలోని ప్రతి రేషన్ దుకాణం ఎదుట డీలర్లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయనున్నారు. 7వ తేదీ నుంచి మండల పరిషత్ కార్యాలయాల ఎదుట దీక్ష చేపట్టనున్నారు.

హామీ అమలు చేయలేదు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని ముందుగానే సమ్మె నోటీసులు ఇచ్చాం. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మెకు దిగాం. ఇప్పటికైన ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి.

–ఎలగల రాజయ్య, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

చెట్లు నరకొద్దు.. ప్లాస్టిక్ వినియోగించొద్దు

- కలెక్టర్ పమేలా సత్పతి



ర్యాలీలో కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

భువనగిరి : మానవ మనుగడ పర్యావరణంతోనే ముడిపడి ఉందని.. అందుకే చెట్లను నరకవద్దని, నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం భువనగిరిలో నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఇందనవనరులను పొదుపుగా వాడాలని, ప్రాణకోటికి జీవనాధారమైన పర్యావరణాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యమన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ మొక్కలు నాటారు. బాలసంరక్షక సదన్‌లో చిన్నారులు మొక్కల ఔన్నత్యాన్ని తెలియజేస్తూ నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, ఎంపీపీ నిర్మలవెంకటస్వామి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, కాలుష్య నివారణ మండల అధికారి సజీన, డీపీఓ సునంద, ఉద్యానవన అధికారి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

'రావి' జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



రావి నారాయణరెడ్డి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : రావి నారాయణరెడ్డి జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి 116 జయంతిని భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన స్థూపానికి అనిల్‌కుమార్ రెడ్డి నివాళులర్పించి మాట్లాడారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేయడంతో పాటు మొదటి పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలోనే అందరికంటే అధిక మెజార్టీతో గెలుపొందారని పేర్కొన్నారు. ట్యాంక్ బండ్‌పై నారాయణరెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్.. మాట తప్పారన్నారు. భువనగిరిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని, కలెక్టరేట్‌కు రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని కోరారు. అమలు చేయని పక్షంలో వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి రావి నారాయణరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, నాయకులు పుట్ట రమేష్, బద్దం వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటి అధ్యక్షుడు స్వామి, ఎల్లంల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'రీజినల్' అలైన్‌మెంట్ మార్చాల్సిందే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు



రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పీవీ

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించిన రైతుల కుటుంబాలను సోమవారం రాయగిరిలోని వారి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు రాయగిరి రైతులు గతంలో విద్యుత్ టవర్లు, జాతీయ రహదారి విస్తరణ, కాళేశ్వర ప్రాజెక్టు కాల్వల నిర్మాణంలో విలువైన భూములు కోల్పోయారని,రీజినల్ రింగ్ రోడ్డు కోసం మళ్లీ భూములు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దల భూములు కాపాడేందుకు అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారని ఆరోపించారు. రైతుల పక్షాన నిలబడాల్సిన ఎమ్మెల్యే వారిపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపడం శోచనీయమన్నారు. రైతులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీఎస్ రెడ్డి, పడాల శ్రీనివాస్, సూదగాని హరిశంకర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్ల నర్సింగ్‌రావు, రాఘవులు, నరేందర్, ఉపాధ్యక్షుడు చందా మహేందర్, అశోక్, ఉపేందర్, రత్నపురం బలరాం, ఉమాశంకర్‌రావు పాల్గొన్నారు.

నేడు టాయ్స్ పార్కుకు శంకుస్థాపన

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో భూమి పూజ చేయనున్న మంత్రి కేటీఆర్
- కామన్ ఫెసిలిటీ భవనం, 51 పరిశ్రమల్లో ఉత్పత్తులు కూడా ప్రారంభం



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వివిధ పరిశ్రమల యూనిట్లు

చౌటుప్పల్ : ఆసియాలోనే అతిపెద్దదైన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు) గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కుకు మంగళవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రానున్నారు. మంత్రి ఉదయం 10 గంటలకు పార్కుకు చేరుకొని మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇక్కడే ఉంటారు. ఈ సందర్భంగా వివిధ యూనిట్లలో ఉత్పత్తులను ప్రారంభించడంతో పాటు టాయ్స్ పార్కుకు భూమి పూజ చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మంత్రి చేతుల మీదుగా చేపట్టనున్న కార్యక్రమాలు ఇవీ..

ఇండస్ట్రియల్ పార్కులో 106 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న టాయ్స్ పార్కు(బొమ్మల తయారీ పరిశ్రమలు)కు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. యూనిట్‌ల ఏర్పాటుకు టాయ్స్ పార్కులో స్థలాలు పొందిన 12 మంది పారిశ్రామికవేత్తలకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. అదే విధంగా నిర్మాణాలు పూర్తి చేసుకున్న 51 పరిశ్రమల్లో ఉత్పత్తులను ప్రారంభించనున్నారు. అనంతరం కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కు ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి తిలకిస్తారు. ఆతర్వాత ప్రతినిధులతో సమావేశం కానున్నారు. చివరగా అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసే సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ నేపథ్యం

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు కోసం 2 వేల ఎకరాలపైగా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సగానికిపైగానే సేకరించి టీఎస్ఐఐసీకి అప్పగించారు. మొదటి విడతలో 442 ఎకరాల్లో కంపెనీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా 450 మంది పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఇప్పటి వరకు 100 పరిశ్రమలు పూర్తయ్యాయి. అందులో 51 కంపెనీలు ఉత్పత్తులను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది చివరినాటికి మరో 50 కంపెనీల్లో ఉత్పత్తులు మొదలుకానున్నాయి. ఆయా పరిశ్రమల్లో ప్రత్యక్షంగా 19 వేల మందికి, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రస్తుతం మరికొన్ని పరిశ్రమల ఏర్పాటుకు స్థలాల కేటాయింపు కొనసాగుతోంది. ఈ పార్కుకు మంత్రి కేటీఆర్ 2019 నవంబరులో శంకుస్థాపన చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1553 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. పార్కులో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించింది.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్, డీసీపీ



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

మంత్రి పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఏర్పాట్లు, బందోబస్తుపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. వారి వెంట పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు కొండవీటి సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్ఐ రాంరెడ్డి, సర్పంచ్ ఎలువర్తి యాదగిరి, తదితరులు ఉన్నారు. అంతకు ముందు డీసీపీ రాజేష్‌చంద్ర ఇండస్ట్రియల్ పార్కును సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



మంత్రి కేటీఆర్ పర్యటనకు సంబంధించి ఇండ్రస్టియల్ పార్కులో అన్ని ఏర్పాట్లు చేశాం. 51 పరిశ్రమల్లో ఉత్పత్తులను ప్రారంభిస్తారు. టాయ్స్ పార్కుకు భూమి పూజ చేస్తారు. ఇండస్ట్రియల్ పార్కుకే తలమానికమైన కామన్ ఫెసిలిటీ భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తారు.

–మిరుపాల గోపాల్‌రావు, సెక్రటరీ, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య

రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలు



గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో కంపెనీల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున ముందుకొస్తున్నారు. ఇప్పటికే సగం యూనిట్లలో ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. రానున్న రోజుల్లో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది.

–కొండవీటి సుధీర్‌రెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య

దీక్షలకు 300 రోజులు

రాజాపేట : మండలంలోని రఘునాథపురంను మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ పొట్టిమర్రి వద్ద గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 300 రోజులకు చేరాయి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మండలం ఏర్పాటు చేసే వరకు దీక్ష కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు దీక్షకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెడిగె పెంటయ్యగౌడ్, చల్లూరు చిన్నపోచయ్య, గంధమల్ల వెంకటేశం, కలకుంట్ల కొమురయ్య, బూరెల శ్రీనివాస్, కటకం నాగేష్, శివ, కొండం నర్సింహులు, కలకుంట్ల వెంకటేశం, సాధు నవీన్, గణపురం నర్సింహులు, సామల రమేష్, గొర్రెంకల సత్యనారాయణ, లెల్లెపాటి పాపిరెడ్డి, నర్సింరెడ్డి, ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న రఘునాథపురం గ్రామస్తులు

క్లుప్తంగా

రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం

మిర్యాలగూడ టౌన్ : షార్ట్ సర్క్యూట్‌తో రైస్ మిల్లులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటన మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ శివారులోని కీర్తి రైస్ మిల్లులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం గుడూరు గ్రామ శివారులో గల కీర్తి రైస్ మిల్లులో ప్రమాదవశాత్తు పవర్ ప్యానల్ బోర్డు అర్ధ రాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతో మంటలు పెద్ద ఎత్తున ఎగిసి పడటంతో కార్మికులు అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంతో సుమారు రూ.5లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు మిల్లు యజమానులు తెలిపారు.

రక్తదానం.. గొప్పదానం


రక్తదానం చేస్తున్న శ్రీకాంత్‌చారి

నార్కట్‌పల్లి : అన్ని దానాల్లో కంటే రక్త దానం ఎంతో గొప్పదని నార్కట్‌పల్లి మండలం బి.వెల్లెంల గ్రామానికి చెందిన రామోజు శ్రీకాంత్‌చారి అన్నారు. నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒకరికి శ్రీకాంత్‌చారి 31వ సారి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేస్తే ఒకరి ప్రాణాలను కాపాడిన వారమవుతామని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నం

బీబీనగర్: గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో పుస్తెల తాడును చోరీ చేసేందుకు యత్నించారు. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టీచర్స్ కాలనీకి చెందిన ఓ మహిళ కాలనీలోని నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి పుస్తెల తాడును తెంపేందుకు ప్రయత్నించగా అరవడంతో దుండుగులు పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేందర్ తెలిపారు.

చోరీ కేసులో ఏడాది జైలు

తుంగతుర్తి: చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రాచర్ల శాలిని సోమవారం తీర్పునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. మట్టపల్లి మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్ 2022 నవంబర్‌లో తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన మూల వెంకట్‌రెడ్డి, గుండా నవీన్ ఇళ్లలో గ్యాస్ సిలిండర్ల చోరీకి పాల్పడ్డాడు. దీంతో అప్పటి ఎస్‌ఐ శివకుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో ఏడాది కాలం జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

తుంగతుర్తి: అంగన్‌వాడీ కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అంగన్‌వాడీ టీచర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండల పరిధిలోని తూర్పుగూడెం అంగన్‌వాడీ కేంద్రాలు-1, 2లను ఒక చోట ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం అంగన్‌వాడీ టీచర్లు తమ విధులు ముగించుకొని వెళ్లారు. టీచర్లు సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా అప్పటికే తాళం పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రంలో 15 నూనె ప్యాకెట్లు, 3 పప్పుప్యాకెట్లు చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు


మొక్క నాటుతున్న జడ్జి బాలభాస్కర్‌రావు

భువనగిరి : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించాలని కోరారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి మారుతిదేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, జిల్లా అటవీశాఖ అధికారి పద్మజారాణి, రేంజ్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, వైద్యాధికారులు వివేకానంద్, మురళీమోహన్, సాయికిరణ్‌రెడ్డి, బషీరుద్దీన్, ప్రియాంకరెడ్డి, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, పీఈటీలు పాల్గొన్నారు.

కేవీకేలో పర్యావరణ దినోత్సవం

గరిడేపల్లి : గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కేవీకే శాస్త్రవేత్త కిరణ్ తెలిపారు. అనంతరం శాస్త్రవేత్తలు రైతులతో కలిసి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. రైతులు ప్లాస్టిక్ వాడకం ద్వారా వచ్చే అనార్థాలు, గ్లోబల్ వార్మింగ్ ద్వారా వాతారణం మార్పులకు కారణమైన గ్రీన్ హౌజ్ గ్యాసెస్ గురించి, నేల ఆరోగ్య పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయ పద్ధతి ద్వారా భూసారం పెంపు విధానాలు, వివిధ రకాల జీవన ఎరువుల వాడకం ద్వారా ఉపయోగం, వాడకంలో రైతులకు కలిగే లాభాల గురించి శాస్త్రవేత్తలు వివరించారు. పచ్చిరొట్టల పంటల ఆవశ్యకత, వానాకాలం పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగులో వెదజల్లే పద్ధతి తదితర అంశాలపై రైతులకు పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, సీహెచ్ నరేష్, కిరణ్, మాధురి, సుగంధీ, కంప్యూటర్ ప్రోగ్రాం అసిస్టెంట్ నరేష్, రైతులు వెంకన్న, ఉపేందర్, వెంకటయ్య, శ్రీను తదితరులున్నారు.

లంచం ఇవ్వక పోతే గేదెలను తీసుకెళ్లారు

- ఎంపీ ఉత్తమ్ ఎదుట దళితబంధు లబ్ధిదారుల ఆవేదన
- ఎంపీపీ అనుచరులు ఖాళీ బాండ్ పేపర్లు రాయించుకున్నారు
- దాణా డబ్బు కూడా కాజేశారని ఆరోపణ


దళితబంధులో జరిగిన అవినీతి గురించి వివరిస్తున్న లబ్ధిదారుడు

కోదాడ: 'దళితబంధు మంజూరు కోసం ముందుగా రూ.2 లక్షలు వసూలు చేశారు. కొందరు ముందుగా డబ్బులు ఇవ్వకపోతే మంజూరైన గేదెల యూనిట్‌లో కొన్ని గేదెలను కోదాడ ఎంపీపీ అనుచరులు తీసుకెళ్లారు. తాజాగా దాణా కోసం మంజూరైన లక్ష రూపాయలను కూడా మాకు తెలియకుండా డ్రా చేశారు. మాకు న్యాయం చేయాలి' అంటూ సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండకు చెందిన దళితబంధు లబ్ధిదారులు సోమవారం నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో విలేకరుల ఎదుట వాపోయారు. గ్రామానికి చెందిన 15 మంది దళితబంధు లబ్ధిదారులు తమ నుంచి ఎంపీపీ అనుచరులు డబ్బులు వసూలు చేశారని, ఖాళీ బాండ్ పేపర్ల మీద సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉత్తమ్ మాట్లాడుతూ.. సూర్యాపేట కలెక్టర్‌గా వినయ్‌కృష్ణారెడ్డి ఉన్న సమయంలో గుడిబండ దళితబంధులో జరిగిన అవినీతి మీద తాను స్వయంగా ఫిర్యాదు చేశానని, విచారణ చేయాలని చెప్పినా పట్టించుకోలేదన్నారు. అవినీతిని పట్టించుకోని ఆయనకు ప్రభుత్వం నల్లగొండ కలెక్టర్‌గా ప్రమోషన్ ఇచ్చిందని అన్నారు. గుడిబండకు మంజూరైన 100 యూనిట్లలో 5 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరిపి వారికి న్యాయం చేయాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటానని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిని బెదిరించినా, ఇబ్బందులకు గురిచేసిన కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందిస్తుందన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పేద దళితుల నోటికాడి కూడును కాజేసిన అధికార పార్టీ నాయకులపై పూర్తిస్థాయి విచారణ జరపాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, వరప్రసాదరెడ్డి, ఇర్ల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

యాదాద్రిలో ఒడిశా హైకోర్టు జడ్జి పూజలు


హైకోర్టు జడ్జి జస్టిస్ పట్నాయక్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న రాజన్‌బాబు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయాన్ని ఒడిశా హైకోర్టు జడ్జి జస్టిస్ ఆర్.కే.పట్నాయక్ తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆచార్యులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన జడ్జి ఆర్.కే. పట్నాయక్, కుటుంబ సభ్యులకు ఆచార్యులు ప్రథమ ప్రకార మండపంలో వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయాధికారి రాజన్‌బాబు లడ్డూ ప్రసాదం అందజేశారు. అంతకు ముందు ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులను దర్శించుకొని అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

పెద్దఅడిశర్లపల్లి : హత్య కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చినట్లు కొండమల్లేపల్లి సీఐ శ్రీనివాస్, గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం మొసంగి గ్రామానికి చెందిన నిరసనమెట్ల వెంకటయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మారడుగుల గ్రామానికి చెందిన సోదరి పారిజాత భర్త చౌట అంజనేయులుకి భూ వివాదాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే బావకు భూమి ఇవ్వడం ఇష్టంలేని వెంకటయ్య గత నెల 30వ తేదీన అంజనేయులును అంగడిపేటకు రప్పించుకున్నాడు. మూడు రోజుల పాటు మద్యం తాపించి ఈ నెల 2వ తేదీన అంజనేయులును సుత్తెతో తలపై మోది దారుణంగా హత్య చేశాడు. అనంతరం తన భార్య రేణుక సహాయంతో అంజనేయులు మృతదేహాన్ని బస్తాలో కట్టి అంగడిపేట సమీపంలోని ఏఎమ్మార్పీ కాలువ పక్కన వేశాడు. నిందితులు వెంకటయ్య, అతనికి సహకరించిన భార్య రేణుకను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై గ్రామస్తుల దాడి

- విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని పోలీసులకు అప్పగింత

పాలకవీడు : విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్న అభియోగం మేరకు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై గ్రామస్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన పాలకవీడు మండలం చెరువుతండా గ్రామ పంచాయతీలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బడిబాట కార్యక్రమంలో భాగంగా చెరువుతండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మరో ఉపాధ్యాయుడితో కలిసి బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు స్థానికంగా ప్రచారం చేపట్టారు. అయితే, సదరు ఉపాధ్యాయుడు గ్రామంలో అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను ర్యాలీలో పాల్గొనాలని కోరాడు. అందుకు విద్యార్థినుల తల్లిదండ్రులు ఒప్పుకున్నప్పటికీ అక్కడే ఉన్న ఓ బాలిక ర్యాలీలో పాల్గొనేందుకు నిరాకరించింది. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ అసభ్యంగా ప్రవర్తిస్తాడని బాలిక తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులకు తెలిపింది. దీంతో వారు ఉపాధ్యాయుడిని చితకబాది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి ఇన్‌చార్జి ఎస్‌ఐ నవీన్‌కుమార్ చేరుకుని ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

యాదాద్రి కొండపై బ్యాటరీ వాహనాలు


బ్యాటరీ వాహనంలో ప్రయాణం చేస్తున్న ఆలయ ఈవో గీతారెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం బ్యాటరీ వాహనాలను ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు సోమవారం మూడు బ్యాటరీ వాహనాలను ఆలయ ఈవో గీతారెడ్డికి అందజేశారు. వాటికి ఆచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వాహనాలు ప్రొటోకాల్ కార్యాలయం, కొండపై బస్టాండ్, ఆలయ మాఢ వీధుల్లో తిరుగుతూ సందడి చేశాయి. మొదటి రోజు వృద్ధులు, వికలాంగులను కొండపైన బస్టాండ్ నుంచి ఆలయ మాఢవీధుల్లోకి బ్యాటరీ వాహనంలో చేర్చారు.

తండ్రిపై కుమారుడి హత్యాయత్నం


తండ్రిపై దాడి చేసిన మురళి

వేములపల్లి : మద్యం మత్తులో తండ్రిపై కుమారుడు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం సమీపంలోని ఇటుక బట్టీల వద్ద సోమవారంసాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాంకరణ్ మహదేవ్‌కు భార్య, ఐదుగురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మురళికి వివాహం కావడంతో భార్యతో కలిసి హైదరాబాద్‌లోని పటాన్‌చెరువు సమీపంలో నివసిస్తున్నాడు. మహదేవ్ కుటుంబంతో కలిసి శెట్టిపాలెం సమీపంలోని బండారు సతీష్ వద్ద ఇటుక బట్టీలో కూలీగా పని చేస్తున్నాడు. కాగా, 15రోజుల క్రితం తల్లిదండ్రులను చూడడానికి మురళి తన భార్యతో కలిసి శెట్టిపాలెం సమీపంలోని ఇటుక బట్టీల వద్దకు వచ్చాడు. ఈ ఏడాది పనులు పూర్తి కావడంతో ఇటుక బట్టీల యజమాని దావత్ ఏర్పాటు చేశాడు. మద్యం సేవించిన అనంతరం తండ్రి, కొడుకుల మధ్య డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో మద్యం మత్తులో ఉన్న మురళి గొడ్డలితో మహదేవ్ మెడపై బలంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలైన మహదేవ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ప్రశ్నించిన రైతులను జైలులో పెట్టడం దుర్మార్గం

- రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా రీజినల్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మర్చారు
- పీసీసీ మాజీ అధ్యక్షుడు హన్మంతరావు


నల్లగొండలో జైలు వద్ద మీడియాతో మాట్లాడుతున్న హన్మంతరావు, నాయకులు

నల్లగొండ : భువనగిరి జిల్లా పరిధిలోని రీజినల్ రింగ్‌రోడ్డు కోసం ముందుగా చేసిన సర్వే ప్రకారం కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా అలైన్‌మెంట్ మార్చారని, దీనిపై ప్రశ్నించిన రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. నల్లగొండ జైలులో ఉన్న భువనగిరి రైతులను ఆయన సోమవారం ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. భువనగిరి ఎమ్మెల్యే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నాడని, రైతులు తమకు అన్యాయం జరుగుతుందని ప్రశ్నిస్తే వారిని అక్రమంగా అరెస్టు చేసి నల్లగొండ జైల్‌లో పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఒక పక్క ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటూ మరో పక్క రైతులను జైల్‌లో పెట్టడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఈ విషయంలో సీఎం స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల కోసం రూ.105 కోట్లు ఏవిధంగా మంజూరు చేస్తుందని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్నారు. అనర్హులకు ఇళ్లు ఇవ్వడంతో కిరాయికి ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు.

సూర్యాపేటలో బీసీ గర్జన సభ

సూర్యాపేటలో బీసీ గర్జన సభ నిర్వహిస్తామని వీహెచ్ చెప్పారు. ఈ సభ విషయమై రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలతో మాట్లాడుతున్నామని, త్వరలోనే తేదీ నిర్ణయిస్తామన్నారు. సభకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యను పిలుస్తామన్నారు. కర్ణాటక తరహాలోనే తెలంగాణలో, దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఈ విషయాన్ని అమెరికాలో రాహుల్‌గాంధీ చెప్పారని అన్నారు. కాంగ్రెస్ దెబ్బకు బీజేపీ, బీఆర్ఎస్ బంగాళాఖాతంలో పడుతాయన్నారు. ఆయన వెంట నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

సహకార బ్యాంకులో రూ.8లక్షలు చోరీ


దుండగులు బ్యాంకులోకి చొరబడింది ఈ కిటికీగుండానే..

గరిడేపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం సహకార సంఘం బ్యాంకులో రూ.8లక్షలు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బ్యాంకు అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కీతవారిగూడెం సహకార సంఘం బ్యాంకు సిబ్బంది శనివారం సాయంత్రం క్యాష్ కౌంటర్లలోనే నగదు ఉంచి తాళం వేసి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం అధికారులు బ్యాంకుకు వచ్చి చూడగా కౌంటర్లోని రూ.8లక్షలు కనిపించలేదు. దుండగులు బ్యాంకు వెనుక భాగంలో ఉన్న కిటికీ చువ్వలు కట్ చేసి లోనికి చొరబడి కౌంటర్లలో ఉన్న నగదును చోరీ చేసినట్లు బ్యాంకు అధికారులు లక్ష్మయ్య, గోపాలకృష్ణ తెలిపారు. ఈ విషయంపై వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ చోరీపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

బీఆర్ఎస్ ఫ్లెక్సీలపై కాంగ్రెస్ నిరసన


తహసీల్దార్ హుస్సేన్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గుర్రంపోడు : ప్రభుత్వ కార్యాలయాల వద్ద బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, మోడల్ స్కూల్‌ల వద్ద పార్టీ గుర్తుతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ కార్యాలయాలను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలుగా మార్చడాన్ని వారు ఆక్షేపించారు. అధికారులు తక్షణమే ఫ్లెక్సీలు తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. అనంతరం తహసీల్దార్ హుస్సేన్, ఎస్‌ఐ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మండలఅధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు వడ్డగోని యాదగిరిగౌడ్, తగుళ్ల యాదయ్య, చనమల్ల యాదవరెడ్డి, లెంకల అశోక్‌రెడ్డి, కమతం జగదీశ్వర్‌రెడ్డి, మామిడి పెద్దులు, మండలి లింగయ్య, కట్ట నర్సింహ్మా, కంచర్ల జాన్‌రెడ్డి, బైరెడ్డి విజయ్‌కుమార్, మనిచందన్‌రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

భువనగిరి : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని హన్మాన్‌వాడకు చెందిన జోగు మహేష్ గత ఏప్రిల్ 10న తన భార్యతో కలిసి స్థానిక యూనియన్ బ్యాంకుకు వెళ్లాడు. రూ. లక్ష విత్ డ్రా చేసుకుని బైకు డిక్కీలో పెట్టారు. అనంతరం మర్చిపోయిన సెల్ ఫోన్‌ను తెచ్చుకునేందుకు తిరిగి బ్యాంక్‌లోకి వెళ్లి తిరిగి వచ్చే సరికి నగదు చోరీకి గురైంది. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లాకు చెందిన ఘంటా శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో యూనియన్ బ్యాంక్ వద్ద తానే చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద ఉన్న రూ. 50 వేల నగదును స్వాధీనం చేసుకుని అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

భువనగిరి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలయ్యాయి. భువనగిరి, తుర్కపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన ఆకుల లింగస్వామి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 4న భువనగిరి మండలంలోని మన్నెవారి పంపు గ్రామంలో జరిగిన బొడ్రాయి పండుగకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు సోమవారం ఉదయం కారులో భార్య స్వాతి, పిల్లలు దీక్షిత, హర్షిత్‌లతో కలిసి బయలుదేరారు. మండలంలోని అనాజిపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే వలిగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. దీంతో లింగస్వామి కారు పల్టీలు కొట్టింది. కారులో ఉన్న లింగస్వామి భార్యతో పాటు పిల్లలకు గాయాలైనట్లు ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపారు. లింగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైక్‌లు, ఆటో ఢీకొని..

తుర్కపల్లి: మెదక్ జిల్లా చేగుంటకు చెందిన డీకోజు సతీష్, శ్రీశైలం, అన్నోజు శ్రీనివాస్‌చారి, బండారి రాములు రెండు బైక్‌లపై ఆదివారం ఉదయం తుర్కపల్లి మండలంలోని మల్కాపూర్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. అదే రోజు రాత్రి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మండల కేంద్రం శివారులో ఎదురుగా వచ్చిన ఆటో వీరి బైక్‌లను ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో శ్రీనివాస్‌చారి, సతీష్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి కారణమైన ఆటో ఆపకుండా వెళ్లిపోయింది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని బాధితులను 108 వాహనంలో మెదక్ జిల్లాలోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికై నట్లు మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నవీన్‌కుమార్, జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ, సీనియర్ క్రీడాకారుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. అండర్-19 విభాగంలో జె. ప్రణీత్‌కుమార్, పి.గౌతమ్, బి.వివేక్, కె.అభినయ్‌రెడ్డి, ఎం. జయశ్రీ, వి.శ్రీలాస్య, పి.పూజిత, బి. కీర్తిమయి ఎంపికైనట్లు తెలిపారు. వీరు సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీలో ఈ నెల 24 నుంచి 28వరకు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నల్లగొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ రంగారావు పర్యవేక్షణలో ఎంపికైన వీరికి సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు.

74 మందికి జరిమానా

యాదగిరిగుట్ట: మద్యం సేవించి వాహనాలు నడిపిన 74మందికి ఆలేరు జేఎఫ్‌సీఎం కోర్టు జరిమానా విధించినట్లు యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ శివశంకర్‌గౌడ్ తెలిపారు. ఇటీవల మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసిన నేపథ్యంలో సోమవారం లోక్ అదాలత్‌లో భాగంగా ఆలేరు జేఎఫ్‌సీఎం కోర్టు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఒక్కొక్కరికీ రూ.2వేల చొప్పున 72మందికి రూ.1,48,000 జరిమానా విధించారన్నారు. పట్టుబడిన వారి నుంచి 23 ద్విచక్ర వాహనాలు, 1 మూడు చక్రాల వాహనం, 50 ఫోర్ విల్లర్స్‌ను సీజ్ చేశామని తెలిపారు.

నేటి నుంచి ఆలయ కౌలు భూములకు వేలం

కనగల్ : కనగల్ మండల పరిధిలోని ఎం. గౌరారం గ్రామపంచాయతీ పరిధిలో హాలియా మండలం మారెపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన కౌలు భూములకు మంగళవారం నుంచి వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి, చైర్మన్ మట్టపల్లి వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేల డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు. మొత్తం 189ఎకరాల భూమికి సంబంధించి 70ప్లాట్లకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వేలం మండల పరిధిలోని సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తామని, ఒకే రోజు వేలం పూర్తికాకపోతే మరుసటి రోజు కూడా నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు మండలం గోలనుకొండ గ్రామానికి చెందిన ఇందూరి రామచంద్రారెడ్డి(55) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రామచంద్రారెడి పని నిమిత్తం రాత్రి బైకుపై హైదరాబాద్ బయలుదేరాడు. ఈ క్రమంలో భువనగిరిలోని బైపాస్ రోడ్డుపై నల్లగొండ బ్రిడ్జి సమీపంలో రాంగ్ రూటులో వస్తున్న లారీ ఇతని బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాచంద్రారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దకాపర్తిలో రెండు ఇళ్లలో దొంగతనం

చిట్యాల: గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకాపర్తి గ్రామానికి చెందిన పోట్లపల్లి శ్రీధర్‌గౌడ్ ఆదివారం మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో జరుగుతున్న బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొనేందుకు బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం తమ ఇంటికి వచ్చి చూడగా తాళం తీసి ఉంది. అంతేకాకుండా ఇంట్లోని బీరువా తాళం తీసి అందులోని అందులో ఉంచిన ఏడు తులాల బంగారు, 19 తులాల వెండి ఆభరణాలు, రూ.25,000 నగదుతో పాటు గ్యాస్ సిలిండర్, స్మార్ట్ టీవీని ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా ఆ పక్కనే నివాసం ఉండే తన తల్లి పోట్లపల్లి సుగుణమ్మ రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో జరిగిన బొడ్రాయి పండగకు ఆదివారం వెళ్లింది. ఆమె ఇంట్లో కూడా దుండగులు వెండి ఆభరణాలతో పాటు రూ.10వేల నగదు, గ్యాస్ సిలిండర్ అపహరించుకుపోయారు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మర్రిగూడలో

మర్రిగూడ: మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన కట్కూరి సత్తమ్మ గత నెల 21న హైదరాబాద్‌లో నివసిస్తున్న తన కుమారుడి వద్దకు వెళ్లింది. తాళం వేసి ఉన్న తన ఇంటి ప్రధాన గేటు, తలుపు, బీరువా తెరిచి ఉన్నట్లు సమీప ఇంటి వారు సత్తమ్మకు ఫోన్ ద్వారా సోమవారం సమాచారం ఇవ్వడంతో తిరిగి వచ్చింది. ఇంట్లో పరిశీలించగా నాలుగు తులాల బంగారంతోపాటు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న అనంతరం సమీపంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా క్లూస్ టీం సహకారంతో విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.